పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



బాబానగర్‌లో చెత్త చెదారం



చెత్తలో పందుల గుంపు

పట్టణంలో కరువైన అధికారుల నిఘా

- విచ్చలవిడిగా చెత్త పారబోత
- కుక్కలు, పందులు వీర విహారం

సంగారెడ్డి : జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణంలో 38 వార్డులు ఉండగా ఏఒక్క వార్డులో కూడా పరిశుద్ధ్యం మెరుగుపడలేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఆస్పత్రి పరిసర ప్రాంతంలో ఉన్న బాబానగర్‌లో పారిశుద్ధ్యం మరింత దారుణంగా ఉందని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. పక్కనే ఆస్పత్రి, మెడికల్ కాలేజీ ఉండడంతో వివిధ రకాల వ్యర్థాలను కాలనీలోనే పాడేస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రతినిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. ఎక్కడ పాడితే అక్కడ చెత్త పారేయడంతో ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తూ రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాబానగర్‌లో పారిశుద్ధ్య వ్యవస్థను బాగు చేయాలని కోరుతున్నారు.

ఎక్కడ చూసినా చెత్తే..

మా కాలనీలో ఎక్కడ చూసినా చెత్త చెదారం దర్శనమిస్తోంది. ఖాళీ స్థలంలో విచ్చలవిడిగా చెత్త పారబోస్తుండడంతో ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పందులు కూడా చెత్తలో బోర్లుతూ ఇళ్ల వద్దకు వచ్చి మురికికూపంగా చేస్తున్నాయి. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలి.

– మల్లేశం, బాబానగర్

చర్యలు తీసుకుంటాం..

పట్టణంలో పారిశుద్ధ్య వ్యవస్థపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. చెత్త పారపోసిన వారిపై ఫిర్యాదు చేయండి. వార్డు జవాన్లు, మున్సిపల్ కార్మికులు వచ్చి చెత్తను తొలగిస్తారు.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్

ఆస్పత్రులకు నోటీసులు జారీ



నీలం ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న బృందం

సంగారెడ్డి : బాలింత మృతి ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ స్పందించిన విషయం తెలిసిందే. ఆదివారం జిల్లా వైద్య బృందం మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. జహీరాబాద్‌లోని నీలం హాస్పిటల్ , సంగారెడ్డిలోని వెల్నెస్ హాస్పిటల్ సందర్శించి బాలింత మృతి గల కారణాలపై ఆరా తీశారు. హాస్పిటల్లో ఇచ్చిన చికిత్సకి సంబంధించిన వివరాలు సేకరించి రెండు హాస్పిటల్స్‌కు నోటీసులు ఇచ్చారు. సోమవారం తిరిగి ప్రముఖ గైనకాలజిస్ట్‌తో కూడిన సభ్యుల బృందం మళ్లీ ఆ రెండు ఆస్పత్రులను సందర్శించి వారు ఇచ్చిన వైద్య సేవల రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి వైద్య అధికారి నాగనిర్మల తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం జిన్నారం మండలం మాదారం, మంత్రికుంట గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీ రఘునందన్ రావు స్వయంగా కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఎదుగుదలకు కష్టపడి పని చేయాలని సూచించారు. అప్పుడే సరైన గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీలో చేరిన వారిలో అశోక్, శంకర్, రమేష్, సత్యనారాయణ, నవీన్, శేఖర్‌సింగ్, విఠల్ సింగ్, గోవింద్ సింగ్, సునీల్, అనిల్, ఆకాష్, మహేష్, రాకేశ్‌లాల్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జోగిపేట(అందోల్): అందోల్‌లోని గురుకుల పాఠశాల విద్యార్థినులు జిల్లా కేంద్రంలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎస్‌బీఆర్ కప్–2 నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ కరాటే ఛాంపియన్ షిప్' పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. అందోల్ టీఎస్ డబ్ల్యూఐఆర్‌ఈఎస్ పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థినులు పోటీల్లో ప్రతిభ కనబరిచి 5మంది బంగారు, 11 మందికి వెండి, 11 మందికి కాంస్య మెడల్‌లు సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు రాణించడం హర్షించదగ్గ విషయమని టీఎస్ డబ్ల్యూఐఆర్‌ఈఎస్ ప్రిన్సిపాల్ లింగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ రజిత, కుంగ్–ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 33 మందికి జరిమానా



జహీరాబాద్‌టౌన్: పరీక్షలు చేస్తున్న ఏఎస్‌ఐ

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రా ఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో డ్రైవ్‌లో 33 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 32 మందికి రూ. వెయ్యి చొప్పున, మరో వ్యక్తికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రాయిపల్లిలో..

జహీరాబాద్ టౌన్: రాయిపల్లి తండా రోడ్డుపై సోమవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఏఎస్‌ఐ రాంమోహన్ ఆధ్వర్యంలో రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

20మందికి జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాత బస్టాండ్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఇరవై మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా ఐదుగురికి రూ.1500, మిగతా పదిహేను మందికి రూ. 1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కంది(సంగారెడ్డి): మండలంలోని ఎద్దు మైలారం ఆయుధకర్మాగారం (ఓడీఎఫ్)లోని జెడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస రావు సొంత ఖర్చుతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు విజయ భాస్కర్, రవీందర్, సుభాష్ సింగ్ తదితరులు శ్రీనివాస రావును అభినందించారు.

తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వేసవి ప్రారంభానికి ముందే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్ నియోజకవర్గాల్లో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా మంజీరా నదిలో నిర్దేశిత లెవల్ నీటి నిర్వహణ ఉండేలా ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. సింగూరు నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఖేడ్ నియోజకవర్గంలో నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు రూ.2.50కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. బోర్ల డ్రిల్లింగ్, పైప్ లైన్ల ఏర్పాటు, ట్యాంకులకు కనెక్షన్లు, ఇతరత్రా మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు. మిషన్ భగీరథ ద్వారా పెద్దారెడ్డిపేట నుంచి నీరు సక్రమంగా రావడంలేదని, విద్యుత్ సమస్య నివారణకు గొర్రెకల్ వద్ద ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌ఏపీ బోరంచ, శాపూర్ పథకాల పునరుద్ధరణకు రూ.4కోట్లతో ప్రతిపాదించామని, తద్వారా 30 హ్యాబిటేషన్లకు నీటి సమస్య తీర్చగలమని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల్లోనే ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఖేడ్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల మరమ్మతులకు రూ.6.50 కోట్లు, అగ్నిమాపక కేంద్రం భవనం, బోరు, ట్యాంకు నిర్మాణానికి రూ.1.20కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రమేష్ చౌహాన్, దారం శంకర్, దిగంబర్‌రెడ్డి, సిద్దారెడ్డి, మాణిక్యం , పరశురాం, గిరిచౌహాన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

పటాన్‌చెరు టౌన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర ఆదేశాల మేరకు మండలంలోని ఇంద్రేశం మహాత్మాజ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాలు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని.. న్యాయ సహాయం కోసం సంగారెడ్డిలోని న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. అనంతరం హాస్టల్లో విద్యార్థులకు అందించే భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఎస్ఐ కుర్షిత్, ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణకు ఆదేశం



విచారణ చేస్తున్న పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని నేరడిగుంట సంతలో తైబజార్‌లో రెట్టింపు ధరలు పెంచి కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లకు పాల్పడడంపై ఆదివారం సాక్షి దినపత్రికలో తైబజార్‌లో అక్రమ వసూళ్లు అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పంచాయతీ ఉన్నతాధికారులు అక్రమ వసూళ్లపై విచారణ చేపట్టి రికవరీ చేయాలని ఆదేశించారు. దీంతో ఎంపీఓ సోమ్‌నారాయణ, పంచాయతీ కార్యదర్శి నర్సింహాస్వామి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టి కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశారు. పంచాయతీ నిర్ణయించిన రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తే టెండరును రద్దు చేస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



జేసీబీతో నిర్మాణాన్ని కూల్చేస్తున్న అధికారి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లిలోని 181 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తూ.. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులతో తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ సారథ్యంలో సిబ్బంది నిర్మాణాలను కూల్చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల పరిరక్షణపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు వేగవంతం



కమిషనర్‌కు చెక్కును ఇస్తున్న యాజమాన్యం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను వసూలు 70 శాతానికి చేరినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సీడీఎంఏ అధికారుల ఆదేశాల మేరకు అదనంగా మరో 10 యాక్సిస్ బ్యాంక్ ద్వారా హ్యాండ్ హెల్డ్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు సంవత్సరాలుగా పన్ను చెల్లించని భారత్ పెట్రోల్ బంక్ యాజమాన్యం సోమవారం కమిషనర్‌కు చెక్కుల రూపంలో పన్ను చెల్లించారు. పారిశుద్ధ్య వాహనాల పన్ను చెల్లింపులపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. మొత్తం 16 కోట్ల 19 లక్షలకు గాను ఇప్పటివరకు 11 కోట్ల 32 లక్షల పన్నులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ పన్ను చెల్లింపుదారులను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో నర్సింలు మేనేజర్ మల్లికార్జున స్వామి బిల్ కలెక్టర్లు అకౌంటెంట్ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ



మదన్‌రెడ్డితో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: గుండె సంబంధిత సమస్యతో శస్త్ర చికిత్స చేసుకున్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కాంగ్రెస్ నేత నీలం మధు పరామర్శించారు. సోమవారం మదన్‌రెడ్డి నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన మదన్‌రెడ్డి ప్రజల ఆశీస్సులతో పాటు.. ఆ భగవంతుడి కృపా కటాక్షాలతో తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ పీడీ చలపతిరావు సోమవారం ప్రారంభించారు. మండలంలోని బర్దిపూర్ గ్రామంలో అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి, పనుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, హౌసింగ్ ఏఈ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శిల్ప, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: పట్టణ శివార్లలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తమిళనాడులోని మహాబలిపురం నుంచి తీసుకువచ్చిన విగ్రహాలను సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధులగుండా వెంకటాపూర్ చౌరస్తాలోని మార్కండేయ మందిరం వరకు శోభాయాత్రగా ఊరేగించారు. పద్మశాలీ మహిళలు, పురుషులు, యువకులు ప్రత్యేక వేషాధారణలు, వారీకార్ భజనలతో ఊరేగింపు ఆకట్టుకుంది. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, కరణ్ గజేంద్ర భారతీ మహరాజ్‌లు విగ్రహాలకు పూజలు నిర్వహించారు.

జాతరలో ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని రొయ్యపల్లిలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సునీత రెడ్డికి ఆలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. మండలంలోని పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కోహీర్ లైబ్రరీని ఆధునీకరిస్తాం



లైబ్రరీని పరిశీలిస్తున్న అంజయ్య

జహీరాబాద్: మండల కేంద్రం కోహీర్‌లోని లైబ్రరీని సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోహీర్ లైబ్రరీని అభివృద్ధి చేసేందుకు నిధులను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి అంతస్తును కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ఉర్దూ పుస్తకాల సంఖ్యను కూడా పెంచేలా చూస్తామన్నారు. పాఠకుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని అందుకు అనుగుణంగా పుస్తకాలను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. జహీరాబాద్‌లో సైతం కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. గ్రంథాలయంలో ఉర్దూ పుస్తకాల సంఖ్యను పెంచాలని గ్రామానికి చెందిన పలువురు కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతులు ఐక్యంగా ఉండాలి : అంజిరెడ్డి

సంగారెడ్డి టౌన్ : రైతులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని బీకేఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడానికి బీకేఎస్ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. పోరాటాల కృషి వల్లే గ్రామాల్లోని రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. చెరుకు, మార్కెట్, మద్దతు ధర సమస్యలు తొందరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు యాదగిరి రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

◆ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

జహీరాబాద్ టౌన్: సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల నైపుణ్యాలు బయటపడుతాయని మండల విద్యాధికారి బస్వరాజ్ అన్నారు. పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో సోమవారం అకాడమీ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఎంఈఓ బస్వరాజ్ వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ఫెయిర్‌ల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీశైలం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి స్థానిక సబ్‌స్టేషన్‌లో అదనంగా 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ (ప్రాజెక్టు) నందకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ నాగరాజ్ మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో లోడ్ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా మూడవ 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ శ్రీనాథ్, డీఈఈ లక్ష్మీనారాయణ, ఏడీఈలు మధుసూదన్, రజనీకాంత్‌లు పాల్గొన్నారు.

◆ ఉపాధి పథకంతో ప్రయోజనం

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్ కూలీలకు సూచించారు. మండలంలోని మాటూర్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ రమేష్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. కూలీల వివరాలు, హాజరు నమోదును పరిశీలించారు. అనంతరం ఇటికేపల్లి, ఖాంజమాల్ పూర్ గ్రామాల్లో రైతులు, కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఉపాధి పథకంపై అవగాహన కల్పించారు. జాబ్ కార్డు కలిసి ఉన్న ప్రతి కుటుంబం 100 రోజుల పని పూర్తి చేయాలని సూచించారు. పథకంలోని వివిధ రకాల పనులను వివరించారు. పథకంలో రైతులతో పాటు కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ పనులు పూర్తవుతున్న నేపథ్యంలో మండలంలో ప్రస్తుతం పని చేస్తున్న 1726 మంది కూలీల సంఖ్యను పెంచాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు.

◆ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం మ.2 గంటల నుంచి సా.5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ మాధవరావు తెలిపారు. సబ్‌స్టేషన్ 3 పరిధిలో మరమ్మతుల కారణంగా గాంధీనగర్ జ్యోతినగర్, అదేవిధంగా సబ్‌స్టేషన్ 4లో ఓల్డ్ విలేజ్ జ్యోతి నగర్ ట్యాంక్ ఏరియా అదాస బీసీ కాలనీ, ఓల్డ్ విలేజ్ ఎస్సీ కాలనీ, జీజీపీ ఏరియా బస్టాండ్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు గృహ వినియోగదారులు పారిశ్రామికవేత్తలు సిబ్బందికి సంపూర్ణంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

◆ అమ్మవారికి పంచలోహ కిరీటం

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచన నల్లపోచమ్మ అమ్మవారికి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రాంతానికి చెందిన భక్తుడు చంద్రశేఖర్ పంచలోహ కిరీటం బహూకరించారు. అనంతరం అమ్మవారికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై జరిమానా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణదారులకు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ జరిమానా విధించారు. 120 మైక్రోన్స్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్స్ వాడకూడదని హెచ్చరించారు. ఈ మేరకు షాపుల్లో తనిఖీలు నిర్వహించి భారీ మొత్తంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు షాపులకు జరిమానా విధించారు.

◆ ఇళ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఖాళీ స్థలాలను ఎంపీడీఓ హరినందన్‌రావు పరిశీలించారు. సోమవా రం మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో పలు స్థలాలను పరిశీలించారు. గ్రామంలో 62 ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాగా వారిలో ఖాళీ స్థలాలు 25 మాత్రమే ఉన్నాయని తెలిపారు. మిగతా ఇల్లు కొన్ని శిథిలావస్థలో, మరి కొన్ని పూరి గుడిసెలు, ఇంకొన్ని రాతీగోడలు ఉన్నట్లు ఎంపీడీఓ చెప్పారు. ఈ నెల 6, 10న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోయనున్నట్లు పేర్కొన్నారు. అప్పటివరకు గుడిసెలు, గోడలను తొలగించుకోవడం, తొలగించుకోకపోవడం లబ్ధిదారుల ఇష్టమన్నారు. ముందుగా ఖాళీ స్థలాలు న్న వాటిలోనే ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోస్తామన్నారు.

◆ బాలికా సాధికారత క్లబ్‌పై సదస్సు

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(కె) బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా బాలికా సాధికారత క్లబ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ, షీటీం సభ్యురాలు షానుబాయి, ఇంపాక్ట్ సభ్యురాలు సంగీతలక్ష్మి, ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు– పరిష్కారాలు, లీగల్ లిట్రసీ, పరీక్షల నుంచి ఒత్తిడి నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

◆ శాండ్విక్ యూనియన్ ఆదర్శం

పటాన్‌చెరు: సామాజిక కార్యక్రమాల్లో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆదర్శంగా నిలుస్తుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షుడు చుక్కారాములు అన్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో గల శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం శాండ్విక్ పరిశ్రమ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాండ్విక్ ప్లాంట్ హెడ్ అభిజిత్, చుక్క రాములు హాజరై బ్లడ్ డొనేషన్ క్యాంపును ప్రారంభించారు. రాములు మాట్లాడుతూ.. ఒక పరిశ్రమలో 40 సంవత్సరాల పాటు ఒకే నాయకత్వంలో సీఐటీయూ అనుబంధంగా యూనియన్ కొనసాగడం, అనేక ఒడిదుడుకులు ఎదురైనా కార్మికులు ఐక్యంగా నిలబడటం గర్వకారణమన్నారు.